


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
19-01-2025
పేజీలు: 02



## ఆప్‌తో పొత్తు లేదు కానీ

ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు లేదు కానీ తలుపులు మూసుకుపోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయిలో "ఇండియా" కూటమి భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, ఆప్.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థులు తలపడుతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ చేసే అవకాశాలున్నాయా అని మాకెన్‌ను మీడియా అడిగినప్పుడు, అవసరమైతే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉండొొచ్చని, అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని ఆయన సమాధానమిచ్చారు."ఆప్‌తో పొత్తు తగదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. 2013లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ సరికాదని నేను అనుకుంటున్నాను. అయితే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే" అని మాకెన్ తెలిపారు. కేజ్రీవాల్ 'యాంటీ నేషనల్' అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలపై అడిగినప్పుడు, తాను తన వ్యక్తిగత అభిప్రాయం చెప్పానని, దానికి కట్టుబడి ఉంటానని అన్నారు. 2013లో ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం, 2024లో జతకట్టడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగిందని ఆయన చెప్పారు. ఢిల్లీ ప్రజలు సమస్యలు ఎదుర్కోవడం వల్ల బీజేపీకి లబ్ధి చేకూరుతుందనేది తన నిశ్చితాభిప్రాయమని అన్నారు. కేజ్రీవాల్‌కు ఢిల్లీలో ప్రాముఖ్యత పెరిగితే అది బీజేపీకే కలిసొస్తుందని, బీజేపీతో పోరాడాలంటే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండటం అవసరమని అన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా లేకపోతే బీజేపీతో పోరాడటం కష్టమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఏపీ బీజేపీ నేతలతో అమిత్ షా భేటీ

ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల సమావేశం విజయవాడలోని నోవోటెల్‌లో ఇవాళ(ఆదివారం) జరిగింది. దాదాపు గంటన్నర పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు , ఎంపీలు 20 మంది నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కేడర్‌కు కీలక అంశాలపై అమిత్ షా దిశానిర్దేశం చేశారు. ఏపీలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వం ఏపీకి అందజేసే సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపైన చర్చ జరిగినట్లు సమాచారం. ఏపీకి కేంద్రం ఇస్తున్న ప్యాకేజీలు, పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నేతలకు అమిత్ షా సూచించారు. పార్టీ బలోపేతానికి నేతలు అందరూ కృషి చేయాలని, అంతర్గత విభేదాలు పక్కన పెట్టి.. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అమిత్ షా ఆదేశించారు. ''హైందవ శంఖారావం'' సభ విజయవంతం అవడంపై వీహెచ్‌పీ నేతలు, పార్టీ నేతలను అమిత్ షా అభినందించారు.ఆయన వాహనశ్రేణిపై పూలవర్షం కురిపించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన తర్వాత తొలిసారిగా అమిత్ షా రాష్ట్ర పర్యటనకు వచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో దిగిన ఆయనకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, మంత్రులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి అమిత్ షా కాన్వాయ్‌లో చంద్రబాబు ఇంటికి వెళ్లారు. మార్గం మధ్యలో గూడవల్లి, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, మహానాడు, రమేశ్ ఆస్పత్రి, నిర్మలా కాన్వెంట్, బెంజిసర్కిల్ జంక్షన్లలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు వరుసగా నిలబడి ఆయన వాహనంపై పూలు చల్లారు. కూటమి నేతలకు అమిత్ షా కారులో నుంచి అభివాదం చేశారు. అనంతరం రాత్రి 11 గంటలకు అమిత్ షా నోవోటెల్ హోటల్‌కు చేరుకున్నారు. అమిత్ షా పర్యటనలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 1,200 మంది పోలీసులు ఆయన రక్షణలో ఉన్నారు.





## మహా కుంభమేళా భిన్నత్వంలో
# ఏకత్వానికి ప్రతీక

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా ''భిన్నత్వంలో ఏకత్వానికి'' ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు.. పేదలు, ధనవంతులు ఇలా అంతా కుంభ్‌లో ఏకమవుతారన్నారు.. చారిత్రాత్మకమైన మతపరమైన కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంపై ప్రధాని మోదీ ప్రశంసించారు. 'యువ తరం దాని నాగరికతతో అనుసంధానం అయినప్పుడు, దాని మూలాలు బలపడతాయి.. దీంతో బంగారు భవిష్యత్తుకు భరోసా ఉంటుంది' అని అన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఇది ఈ సంవత్సరం మొదటి ఎపిసోడ్.. ఈ రేడియో కార్యక్రమంలో 118వ ఎపిసోడ్.. వాస్తవానికి, 'మన్ కీ బాత్' కార్యక్రమం నెలలో చివరి ఆదివారం ప్రసారం అవుతుంది.. కానీ ఈసారి చివరి ఆదివారం జనవరి 26 వస్తుంది.. గణతంత్ర దినోత్సవం రోజున వస్తుండటంతో ప్రధాని మోదీ ముందే (జనవరి 19న) మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు.. ఈ సందర్భంగా మహాకుంభ్, అంతరిక్షం, రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ట నుంచి గణతంత్ర దినోత్సవం వరకు.. ఎన్నో విషయాల గురించి ప్రసంగించారు.

ప్రధాని మోదీ ప్రస్తావించిన కీలక విషయాలివే

మన్ కీ బాత్ ప్రతిసారీ నెలలో చివరి ఆదివారం జరుగుతుందని మీరు ఒక విషయం గమనించి ఉంటారు.. అయితే ఈసారి వారం ముందు నాలుగో ఆదివారం కాకుండా మూడో ఆదివారం నిర్వహిస్తున్నాము.. ఎందుకంటే వచ్చే ఆదివారం గణతంత్ర దినోత్సవం వస్తుంది.. ముందుగా దేశప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.. అంటూ ప్రధాని మోదీ అన్నారు.

ఈసారి 'గణతంత్ర దినోత్సవం' చాలా ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అన్నారు. ఇది భారత గణతంత్ర 75వ వార్షికోత్సవం. ఈ ఏడాది రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యాయి. మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ నేను నమస్కరిస్తున్నానంటూ మోదీ పేర్కొన్నారు.

మహాకుంభ పండుగ భిన్నత్వంలో ఏకత్వానికి సంబంధించిన వేడుక అని ప్రధాని మోదీ అన్నారు. కుంభ సంప్రదాయం భారతదేశాన్ని ఒకదానితో ఒకటి అనుసంధానం చేస్తుంది.. మహాకుంభ్‌లో యువత భాగస్వామ్యం పెరిగింది. ఈ సందర్భంగా గంగాసాగర్ జాతరను కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. గంగాసాగర్ జాతర సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు.


అయోధ్యలోని రామ మందిరంలో రామ లల్లాకు ప్రతిష్ఠాపన జరిగిన మొదటి వార్షికోత్సవంపై కూడా ప్రధాని మోదీ మాట్లాడారు.. ప్రాణ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. వారసత్వాన్ని కాపాడుకోవాలని, స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధాని మోదీ అన్నారు.

అంతరిక్ష సాంకేతికతలో దేశం కొత్త పుంతలు తొక్కుతున్నదని మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ అన్నారు. PIXXEL ప్రైవేట్ ఉపగ్రహం ఒక పెద్ద అచీవ్‌మెంట్ అని ప్రధాని మోదీ అన్నారు. స్పేస్ డాకింగ్ విజయవంతం అయినందుకు ఇస్రోను ప్రధాని మోదీ అభినందించారు. స్పేస్ డాకింగ్ చేసిన ప్రపంచంలోనే నాలుగో దేశంగా భారత్ అవతరించిందన్నారు.

జనవరి 25ని జాతీయ ఓటర్ల దినోత్సవం అని ప్రధాని మోదీ అన్నారు. ఈ రోజు ముఖ్యమైనది ఎందుకంటే ఈ రోజున భారత ఎన్నికల సంఘం స్థాపించబడింది. మన రాజ్యాంగ నిర్మాతలు మన ఎన్నికల కమిషన్‌కు, రాజ్యాంగంలో ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట వేశారు. ఎన్నికల సంఘం మన ఓటింగ్ ప్రక్రియను ఆధునీకరించింది.. బలోపేతం చేసిందంటూ చెప్పారు.

స్టార్టప్ ఇండియా కొద్ది రోజుల క్రితమే 9 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. గత 9 సంవత్సరాలలో మన దేశంలో సృష్టించబడిన స్టార్టప్‌లలో సగానికి పైగా టైర్ 2, టైర్ 3 నగరాలకు చెందినవని.. ఇది విన్నప్పుడు ప్రతి భారతీయుడి హృదయం సంతోషిస్తుందన్నారు.. మన స్టార్టప్ సంస్కృతి పెద్ద నగరాలకే పరిమితం కాదని.. అన్ని చోట్లకు వస్తరిస్తుందని తెలిపారు.

## నేను సంపాదించిన ఆస్తి అదే
### బాలయ్య



నటసింహం బాలయ్య — దర్శకుడు బాబీ కాంబినేషన్ లో సంక్రాంతి కానుకగా వచ్చిన ''డాకు మహారాజ్'' బ్లాక్ బస్టర్ టాక్ తో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఈ చిత్రం తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబడుతోంది. పైగా సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో.. ఈ సినిమాకి సాలిడ్ కలెక్షన్స్ వచ్చాయి. ఇక 'డాకు మహారాజ్' ప్రమోషన్ ఈవెంట్లో బాలయ్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ముఖ్యంగా ఫుడ్ విషయంలో తన భార్య వసుంధర తనను తిడుతుందని బాలయ్య చెప్పడం విశేషం. కానీ, తాను ఫిట్‌గా ఉండేందుకు ప్రత్యేక రహస్యం ఏమీ లేదని.. షూటింగ్ సమయంలో తాను ప్రొడక్షన్ ఫుడ్ కూడా తింటానని బాలకృష్ణ చెప్పారు. అలాగే బాలయ్య ఇంకా మాట్లాడుతూ.. పార్టీలకు, కులాలకు అతీతంగా తనకు అందరు ఫ్యాన్స్ ఉన్నారని.. జీవితంలో అదే తాను సంపాదించిన ఆస్తి అని బాలయ్య తెలిపారు. మొత్తానికి డాకు మహారాజ్ తో ఈ సంక్రాంతి సీజన్‌లో బాలకృష్ణ మరో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. కాగా ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ మరియు శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే, చాందిని చౌదరి, ఊర్వశి రౌటేలా, బాబీ డియోల్, బేబీ వేద అగర్వాల్ మరియు VTV గణేష్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## 'కన్నప్ప' ఐడియా ఇచ్చింది ఆయనే
### మంచు విష్ణు




మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రం ''కన్నప్ప''. ఈ చిత్రం కోసం విష్ణు కఠినంగా కష్టపడుతున్నాడు. పైగా ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి ఎంతోమంది అగ్ర నటీనటులు కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా కథ ఐడియా పై విష్ణు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'కన్నప్ప' సినిమా ఏడెనిమిదేళ్లుగా తన ప్లానింగ్‌లో ఉందని.. అయితే, బడ్జెట్ కారణాల వల్ల ఇప్పుడు కుదిరిందని.. అలాగే అసలు ఈ సినిమాకు ఐడియా తనికెళ్ల భరణి ఇచ్చారని హీరో మంచు విష్ణు చెప్పారు. కాగా ఏప్రిల్ 25, 2025న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామాకి మహా భారత్ సీరియల్‌ని డైరెక్ట్ చేసిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు.



## కొత్త రేషన్ కార్డులు వీరికే..

కొత్త రేషన్ కార్డులకు 2014 నాటి మార్గదర్శకాలనే ప్రాతిపదికగా తీసుకున్నారు. గ్రామాల్లో కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలుగా నిర్ణయించారు. అలాగే గ్రామాల్లో 3.50 ఎకరాలు అంతకంటే తక్కువ విస్తీర్ణంలో తరి(మాగాణి) పొలం ఉన్న రైతులు, 7.5 ఎకరాలు అంతకంటే తక్కువగా మెట్ట (కుష్కి) ఉన్న రైతులు అర్హులు. కొత్త కార్డుల కోసం JAN 21-24 వరకు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

## నెయ్యిలో కల్తీని వందశాతం గుర్తించేలా..

గతేడాది తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీంతో నెయ్యిని సూక్ష్మస్థాయిలో పరీక్షించేందుకు అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో శ్యామలారావు ప్రకటించారు. తాజాగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రూ.70 లక్షల విలువైన రెండు పరికరాలను విరాళమిచ్చింది. జర్మనీ నుంచి తిరుమలకు తీసుకువచ్చి ల్యాబులో అమర్చారు. వీటితో నెయ్యిలో కల్తీని వందశాతం గుర్తించవచ్చు.

## 100 మందిలో ఒకరికి క్యాన్సర్!

రాష్ట్రంలో 100 మందిలో ఒకరు క్యాన్సర్ అనుమానితులుగా ఉన్నట్లు ప్రభుత్వ స్క్రీనింగ్ పరీక్షల్లో తేలింది. ఇప్పటివరకు 53.07 లక్షల మందికి టెస్టులు చేయగా 52,221 మంది క్యాన్సర్ అనుమానితులు ఉన్నారని ఆరోగ్యశాఖ గుర్తించింది. నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ అనుమానితులే ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. ఈ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది.

## LSG కెప్టెన్‌గా పంత్!

IPL-2025లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ వ్యవహరిస్తారని ESPN CRIC INFO పేర్కొంది. దీనిపై రేపు అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. ఆక్షన్‌లో అతడిని రూ.27కోట్లకు LSG కొనుగోలు చేసింది. స్క్వాడ్‌లో పూరన్, మార్క్రమ్, మిల్లర్ వంటి ప్లేయర్లున్నా స్వదేశీ కెప్టెన్ వైపే టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. పంత్ 2021, 2022, 2024 సీజన్లలో DCకి కెప్టెన్సీ చేసిన విషయం తెలిసిందే.



## వచ్చే నెల 12 నుంచి మినీ మేడారం

మేడారంలో ప్రతి రెండేళ్లకోసారి సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతుందనే సంగతి తెలిసిందే. అయితే మరుసటి ఏడాది నిర్వహించే మండమెలిగె పండుగను మినీ మేడారంగా భక్తులు పిలుస్తారు. వచ్చే నెల 12 నుంచి 15 వరకు ఈ జాతర జరగనుంది. దీని కోసం రూ.32 కోట్లతో అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారు. సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

## నేడు దావోస్ పర్యటనకు చంద్రబాబు

వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్‌లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు నేడు దావోస్ పర్యటనకు వెళ్లనున్నారు. సీఎంతో పాటు అధికారుల బృందం సాయంత్రం అమరావతి నుంచి ఢిల్లీకి వెళ్లి అక్కడనుంచి జ్యూరిచ్ వెళ్లనుంది. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ కానున్నారు. ఈ పర్యటనలో జరిపే చర్చలు, చేసుకునే ఒప్పందాలకు ప్రచారం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.76 కోట్లు రిలీజ్ చేసింది.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com


# ‘పద్మావత్’ ఆఫర్‌ను తిరస్కరించా!

తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటుంది అగ్ర కథానాయిక కంగనారనౌత్. తాజాగా ఆమె ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయన పేరు ప్రస్తావించకుండానే విమర్శలను ఎక్కుపెట్టింది. ‘పద్మావత్’ చిత్రంలో ఆయన ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించానని చెప్పింది. పెద్ద దర్శకుల సినిమాల్లో నాయికల పాత్రలకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదని, వారికి ఓ పావుగంట మాత్రమే స్క్రీన్ టైమ్ కేటాయిస్తారని, వారి పాత్రల్ని తక్కువ చేసి చూపిస్తారని చెప్పుకొచ్చింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ‘‘పద్మావత్’లో అవకాశం వచ్చినప్పుడు స్క్రిప్ట్ మొత్తం ఇవ్వమని దర్శకుడిని అడిగా. అందుకు ఆయన నిరాకరించాడు. సినిమాలో నా పాత్ర ఏంటని అడిగితే ‘అద్దం ముందు ముస్తాబవుతున్న కథానాయికను చూసి హీరో ప్రేమలో పడతాడు’ అంటూ ఒక్క లైన్‌లో కథ చెప్పాడు. ఆ సినిమా చూసినప్పుడు కూడా హీరోయిన్ సినిమా మొత్తం అద్దం ముందే కూర్చొని కనిపిస్తుంది. దాంతో ఆయన చెప్పిన మాటలు నిజమే అనిపించాయి. హీరోయిన్ల విషయంలో దర్శకుల ఆలోచనా విధానం ఇలా ఉంటే ఏ దర్శకుడితో పనియాలి’ అంటూ కంగనా రనౌత్ ప్రశ్నించింది. ప్రస్తుతం ఆమె మాటలు బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# పాతాళ లోక్ సీజన్ 2 రివ్యూ

ప్రముఖ ఓటిటి ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో మన ఇండియన్ కంటెంట్ నుంచి సూపర్ హిట్ అయ్యిన పలు ఫేమస్ వెబ్ సిరీస్ లలో ‘‘పాతాళ లోక్’’ కూడా ఒకటి. గత లాక్ డౌన్ లో వచ్చిన ఈ సిరీస్ సీజన్ 1 పలు కాంట్రవర్సీలతో పాటుగా పెద్ద హిట్ అయ్యింది. మరి దాదాపు ఐదేళ్ల తర్వాత దీనికి సీజన్ 2 మంచి అంచనాలు నడుమ వచ్చింది. ఇక ఈ సీజన్ కూడా మెప్పించిందో లేదో చూద్దాం. సీజన్ 1 నుంచి కొనసాగింపుగా ఢిల్లీలోని తన పోలీస్ స్టేషన్ లోనే అదే పొజిషన్ లో హాతీరాం చౌదరి(జైదీప్ అహ్లావత్) కొనసాగుతారు. కానీ తన కింద ట్రైనింగ్ కి వచ్చిన ఇమ్రాన్ అన్సారీ(ఇస్వాక్ సింగ్) మాత్రం ఐఏఎస్ అధికారిగా మారిపోతాడు. ఈ నేపథ్యంలోనే నాగాలాండ్ కి చెందిన ఓ పవర్ఫుల్ బిగ్ విగ్ జోనాథన్ తాం(కాగిరాంగ్) హోటల్లో అత్యంత దారుణంగా హత్య చేయబడతాడు. దీనితో నాగాలాండ్ లో అది పెద్ద కేసుగా మారుతుంది. ఇది అన్సారీకి సవాలుగా మారగా ఇంకోపక్క హాతీరాం చౌదరికి కూడా ఢిల్లీలో రఘు పాశ్వాన్(శైలేష్ కుమార్) మిస్సింగ్ అందులో రోస్ లిజో(మెరెన్ల ఇంసాంగ్) అనే యువతికి ఉన్న లింక్ ఆ కేసు సెపరేట్ గా ఇన్వెస్టిగేట్ చేసిన ఒక పాయింట్ లో అన్సారీ కేసుతో కూడా కలుస్తుంది. ఈ నేపథ్యంలో వారికి ఉన్న లింక్ ఏంటి ? ఇందులో కపిల్ రెడ్డి(నగేష్ కుకునూర్) చేసిన ప్లాన్, అసలు డ్రామా అంతటి వెనుక ఉన్నది ఎవరు ? ఆ రెండు కేసులు ఎలా సాల్వ్ అయ్యాయి అనేది తెలియాలి అంటే ఈ సిరీస్ ని చూసి తెలుసుకోవాలి. మొదటి సీజన్ మంచి హిట్ కావడానికి ఉన్న ప్రధాన కారణాల్లో సాలిడ్ ఎమోషన్స్ తో సాగే డ్రామా అని కూడా చెప్పవచ్చు. మరి ఈ సీజన్ 2 లో కూడా నీట్ గా డిజైన్ చేసిన డ్రామా ఈ తరహా డ్రామా ఎపిసోడ్స్ కోరుకునేవారికి నచ్చుతుంది. అలాగే ఎపిసోడ్ నడుస్తున్న కొద్దీ రివీల్ అయ్యే ట్విస్ట్ లు గాని అలాగే ఇన్వెస్టిగేషన్ సన్నివేశాలు మంచి ఆసక్తిని రేపుతాయి. ఇన్వెస్టిగేషన్ లో నడిచే యాక్షన్ పార్ట్ అలాగే అందులో ఒకో ట్విస్ట్ రివీల్ అయ్యే విధానం




సింపుల్ గా అలా ఎంగేజింగ్ గా అనిపిస్తాయి. అలాగే సీజన్ 1 తరహాలనే సీజన్ 2 లో కూడా ఒక బ్యూటిఫుల్ ఎండింగ్ అనేది చూసే ఆడియెన్స్ కి మనసు తేలికగా అనిపించేలా చేస్తుంది. వీటితో పాటుగా అన్సారీ ఇంకా హాతీరాం పాత్రల నడుమ నడిచే సన్నివేశాలు అన్నీ ఆ పాత్రలని ఇష్టపడే వారికి మరింత నచ్చుతాయి. ఇక నటీనటుల్లో అయితే సీజన్ 1 తో సాలిడ్ పెర్ఫామెన్స్ ని కనబర్చిన జైదీప్ ఇందులో కూడా మంచి ఎఫర్ట్స్ పెట్టారని చెప్పాలి. చాలా సీన్స్ తో తన హార్డ్ వర్క్ ఆ ఏజ్ లో కూడా కనిపిస్తుంది. ఫిజికల్ గా కూడా ఈ సినిమాకి కష్టపడ్డారు. అలాగే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ గా పని చేసినప్పటికీ సరైన గుర్తింపు రాకపోవడం, అన్సారీపై ఓ ఎమోషనల్ సీన్ తో తన పెర్ఫామెన్స్ వీక్షకులని కదిలిస్తుంది. అలాగే తనతో పాటే సాగే ఇస్వాక్ సింగ్ కూడా మళ్ళీ షైన్ అయ్యాడు. తనపై కనిపించే ఓ కీలక ట్విస్ట్ కి అనుగుణంగా తన నటన కూడా ఈ సీజన్లో మెప్పిస్తుంది. ఇంకా వీరితో పాటుగా నాగాలాండ్ ప్రాంతంలో కనిపించే కీలక వ్యక్తులు, ఇంకా నగేష్ కుకునూర్, తిలోత్తమా షోమే, మెరెన్ల ఇంసాంగ్ తదితరులు తమ పాత్రలకి చాలా నాచురల్ పెర్ఫామెన్స్ లు అందించి ఇంప్రెస్ చేస్తారు. ఈ సీజన్ 2 తో చిన్న ప్రాబ్లమ్ లేకపోలేదు. మీకు గనుక సీజన్ 1 విపరీతంగా నచ్చినట్టు అయితే సీజన్ 2 ఆ రేంజ్ లో ట్రీట్ ఇవ్వకపోవచ్చు. ఇంకా సీజన్ 1 ని పూర్తి చేసి ట్రైలర్ లాంటివి చూడకుండా డైరెక్ట్ గా సీజన్ 2 ని స్టార్ట్ చేసినా కూడా వారు ఒకింత డిజప్పాయింట్ అయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే సీజన్ 1 నుంచి కంప్లీట్ గా పోలీస్ బ్యాక్ డ్రాప్ లో కనిపించే నటీనటుల నుంచి మాత్రమే ఇది కొత్తగా కొనసాగుతుంది. సో సీజన్ 1 లో ఉన్న అందరూ ఆ నటీనటులు కావాలి అనుకున్నవారు డిజప్పాయింట్ అవ్వక తప్పదు. అలాగే ఈసారి సీజన్ 1 కి దీనికి చాలా తేడాలు ఉన్నాయి. అందులో కనిపించే సాలిడ్ వైలెన్స్ కానీ అడల్ట్ సీన్స్ కానీ ఇందులో లేవు. ఇది ఒక రకంగా మంచి విషయమే కావచ్చు కానీ వాటిని మొదటి సీజన్ తో ఇష్టపడ్డవారు ఆ అంశాలతో కూడిన డ్రామా కావాలి అనుకుంటే దీనిపై తక్కువ అంచనాలు పెట్టుకోవాలి. అలా స్లోగా పేలవంగా ఉన్నట్టుగా అనిపిస్తాయి. అలాగే కథనం నడుస్తున్న కొద్దీ ఒకో కొత్త పాత్ర పరిచయం అవుతూనే ఉంటాయి.

## ఘనంగా ప్రారంభమైన కొమురవెల్లి మల్లన్న జాతర

సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. సంక్రాంతి తర్వాత వచ్చి తొలి ఆదివారం కావడంతో భారీగా తరలి వచ్చిన భక్తులు తమ కొంగుబంగారమైన కోర మీసాల మల్లన్నను దర్శించుకుంటున్నారు. రెండున్నర నెలలపాటు కొనసాగనున్న ఈ జాతర.. ఉగాదికి వచ్చే ఆదివారంతో ముగియనుంది. బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున నిర్వహించే పెద్ద పట్నం, అగ్నిగుండాలు ప్రముఖ కార్యక్రమాలు, ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం, రాజగోపురం, గదులకు రంగులు వేయించడంతో సుందరంగా కనిపిస్తున్నాయి. ఆలయంలో ప్రతి ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు బోనాలతో ఆలయానికి వెళ్లి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. పట్నం వేసి కల్యాణం జరిపించి మొక్కులు తీర్చుకుంటారు. పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభమై 12 ఆదివారాలు కొనసాగుతాయి. 12 ఆదివారాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు విశిష్ట దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మ దర్శనం కల్పించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.పట్నం వారానికి ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్ భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు మల్లన్న పేరిట సట్టీ దీక్షలను 41 రోజుల చేపట్టి, పట్నం వారం స్వామిని దర్శించుకున్న అనంతరం, దీక్షను విరమిస్తారు. పట్నం వేసి గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు.





## ప్రతిపక్షం నిలదీస్తే గానీ ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా?

ప్రతిపక్షం నిలదీస్తే గానీ ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులకు కూడా రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం బీఆర్ఎస్ విజయమని చెప్పారు. మీ సేవా దరఖాస్తులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని, పెరిగిన ద్రవ్యోల్బణం ఆధారంగా రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రజలను మోసం చేయాలని చూసిన ప్రతిసారి, తాము మిమ్మల్ని ప్రశ్నిస్తుంటాం, నిలదీస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ‘పేదలకు రేషన్ కార్డులు అందకుండా చేస్తున్నారని, కోతలు విధిస్తున్నారని ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయడంతో పాటు, పత్రికా సమావేశం నిర్వహించి నిలదీస్తే గాని ఈ ప్రభుత్వానికి జ్ఞానోదయం కాలేదు. కుల గణన దరఖాస్తులతోపాటు, ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం, ఇది తుది జాబితా కాదని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వంపై ఒత్తిడి చేసి చెప్పించడం బిఆర్ఎస్ విజయం. ఆదాయ పెంపు విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్ల లక్షల మంది నిరుపేద వర్గాలు రేషన్ కార్డులకు దూరం అవుతాయని మరొక్క సారి గుర్తు చేస్తున్నాం. కేసీఆర్ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పొందేందుకు వీలుగా ఆదాయ, భూ పరిమితి నిబంధనల్లో మార్పులు చేశారు.

## ఎంపీ ఈటల స్ట్రాంగ్ వార్నింగ్.. ఇళ్లను కూల్చడం ఆపకపోతే ఖబడ్దార్

గత పాలకులు 1998 సంవత్సరంలో అరుంధతినగర్‌లో కుటుంబ నియంత్రన చేసుకున్న వారికి అప్పటి ప్రభుత్వం పట్టాలను ఇస్తే వాటిని కూల్చడం ఏమిటని మల్కాజిగిరి ఎంపీ ఈట ల రాజేందర్ రెవెన్యూ అధికారుల తీరుపై మండి పడ్డారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతినగర్‌లో పర్యటించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు అరుంధతినగర్‌లో కూలగొట్టిన ఇళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కూల గొట్టడమే అజేండాగా పెట్టుకుందని అరోపించారు. జవహర్‌నగర్‌లో పేదకుటుంబాలే నివాసం ఉంటున్నాయని ఇక్కడ కూల్చిన రేకుల షెడ్లకు రూ.50 వేలు, స్లాబ్‌లకు రూ,2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెద్దవాళ్లు కోట్లాది విలువైన భూములను కొల్లగొడుతుంటే పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం జవహర్‌నగర్‌లోని పేదలపై మాత్రం తమ ప్రతాపాన్ని చూపుతున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులపై మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటికైనా పేదల జోలికి రాకుండా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షులు విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, కార్పొరేటర్ పానుగంటి బాబు, నాయకులు రంగుల శంకర్, జవహర్‌నగర్ పార్టీ అధ్యక్షులు కమల్, సంతోష్, సందీప్, యాదగిరి, అరుంధతి వాసులు పాల్గొన్నారు.





## పేలిన పెట్రోల్ ట్యాంకర్.. 77 మంది దుర్మరణం

పశ్చిమ ఆఫ్రికా దేశం నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో 77మంది మరణించారు. సెంట్రల్ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్ ఉపయోగించి పెట్రోల్ పంపు చేస్తుండగా పేలుడు జరిగింది. దీంతో పెట్రోల్‌ను పంపు చేస్తున్నవారితోపాటు చుట్టుపక్కన పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరుకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి.




## VT15 ఫస్ట్ లుక్

టాలీవుడ్‌లో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు వరుణ్ తేజ్. ఇటీవలే కరుణకుమార్ దర్శకత్వంలో పాన్ ఇండియా కథాంశంతో తెరకెక్కిన మట్కా బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ తాజాగా వీటీ15 సినిమాను ప్రకటించేశాడు. వరుణ్ తేజ్‌కు పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ వీటీ15 సినిమా ఫస్ట్ లుక్ షేర్ చేశారు. డ్రాగన్ డిజైన్ ఉన్న జాడిపై కోడ్ లాంగ్వేజ్‌తో ఉన్న క్లాత్ మంటలు అంటుకొని అనుమానాస్పదంగా కనిపిస్తుంది. సస్పెన్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో సినిమా ఉండబోతుందని ఫస్ట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. వేట హాస్యాస్పదంగా మారితే అంటూ క్యాప్షన్ కూడా పోస్టర్‌లో చూడొచ్చు. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా ఉండబోతుందని తాజా లుక్‌తో క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు మేర్లపాక. ఈ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలతోపాటు క్యూరియాసిటీ పెరిగిపోతుంది.